క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై సమగ్ర సర్వే



చల్లపల్లిలో మచ్చలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తం: కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఢిల్లీ ప్రసాద్, విస్తరణాధికారి వి.వరప్రసాద్‌లు సిబ్బందితో కలిసి మండలంలోని ఎస్.యానాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి కుష్టు వ్యాధి సంబంధిత మచ్చలున్న వారిని పరిశీలించారు. కార్యక్రమం డిసెంబర్ 27 నుంచి జనవరి 12 వరకూ జరుగుతుందని విస్తరణాధికారి వి.వరప్రసాద్ తెలిపారు.

ఏకవాక్య తీర్మానంతో సమావేశం ముగింపు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఏకవాక్య తీర్మానంతో ముగిసింది. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చిన్నాన్న పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు అమెరికాలోని టెక్సాస్ నగరంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన విషయం తెలిసి కౌన్సిల్ సభ్యులు టేబుల్ అజెండాలో అంశాలు ఏకవాక్య తీర్మానంతో సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కమిషనర్ జి.లోవరాజు, కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల నిమిత్తం ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, పి.మల్లవరం, గాడిమొగ, జార్జిపేట, భైరవపాలెం, పోలేకుర్రు, కోరంగి పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

క్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని సత్కరిస్తున్న క్రైస్తవులు

అల్లవరం: ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిపాలెంలోని గ్రేస్ తాబేర్నాకిల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరై క్రీస్తు బోధనలను వివరించారు. అనంతరం పాస్టర్ యు.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ ఆర్ జోసెఫ్, నవుండ్రు సూర్యనారాయణ, రేవు శ్రీనివాసరావు, వర్దనపు కృష్ణ, జల్లి ఏడుకొండలు, మాకే వెంకటరమణ, జంగా దుర్గాప్రసాద్, రొక్కాల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పొన్నాడ బంధువుల మృతికి సంతాపం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బంధువులు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై తాళ్లరేవు మండల నాయకులు బుధవారం తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, సచివాలయ కన్వీనర్ దున్నా శ్రీకాంత్ తదితరులు సంతాపం తెలిపారు.

1200 మద్యం సీసాల ధ్వంసం



మద్యం సీసాల ధ్వంసం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ ఖాదర్‌బాషా, ఎస్ఈబీ సీఐ శివరామరాజు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో గత నాలుగు నెలల్లో పట్టుబడిన 1200 మద్యం సీసాలను స్టేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు పర్యవేక్షణలో సీసాలను ధ్వంసం చేశారు. రూ.86 వేల విలువైన 1200 సీసాలకు చెందిన 253 లీటర్ల మద్యాన్ని, 4 లీటర్ల సారాయిని నేలపాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ స్వామి రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఏవీఎస్ఆర్ రాజు, వీఆర్వో ఎల్లేశ్వరరావు, మహిళా పోలీసు కృష్ణవేణి, ఎస్ఈబీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీల్లో తలబడుతున్న విద్యార్థినులు



లక్ష్మీపతిపురంలో వాలీబాల్ విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ ఎం.అనుపమ, సర్పంచ్ గోవలక్ష్మి



దేవగుప్తంలో కబడ్డీలో పోటీపోటీగా తలపడుతున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, ఎన్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం రెండో రోజు ఉత్సాహంగా సాగింది. కబడ్డీ, క్రికెట్, కోకో పోటీల్లో యువతీయువకులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు. ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ ఆటల పోటీలను చూడటానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపతిపురంలో వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ ఎం.అనుపమ, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు పంచాయతీ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి ఆర్థిక సాయంతో సమకూర్చిన బహుమతులను ఎంపీడీఓ అనుపమ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, ఎంపీటీసీ సభ్యురాలు వనమాడి వేణు, గ్రామ ఉపసర్పంచ్ కె.లోకేష్, కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, హైస్కూల్ హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా దేవగుప్తం ఉన్నత పాఠశాలలో జరిగిన కబడ్డీ పోటీలో పురుషుల విభాగంలో ఎ.సుబ్బారావు టీమ్, మహిళల విభాగంలో ఎం.సౌమ్య టీమ్ విన్నర్‌గా నిలిచారు. అల్లవరం–1లో పురుషుల విభాగంలో రేలంగి దుర్గాప్రసాద్, మహిళల విభాగంలో రొక్కాల సమీరా, అల్లవరం–2లో పురుషుల విభాగంలో వానపల్లి సూర్యప్రశాంత్, మహిళల విభాగంలో కొల్లు లక్ష్మీప్రసన్న, తూర్పులంకలో పురుషుల విభాగంలో పచ్చిమాల కిరణ్ కుమార్, మహిళల విభాగంలో గుత్తుల నాగమణి టీమ్‌లు గెలుపొందాయని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు.

సుదర్శనబాబు మృతి తీరని లోటు



పాతయింజరంలో సుదర్శనబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు భూపతిరాజు సుదర్శనబాబు మృతి పార్టీకి తీరని లోటని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు(శ్రీను) అన్నారు. సుదర్శన బాబు నాలుగో వర్ధంతి సందర్భంగా పాతయింజరం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సుదర్శన బాబు నిలువెత్తు విగ్రహానికి పిన్నంరాజు వెంకటపతిరాజు, ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఢిల్లీ నారాయణ, కొండేపూడి కృపావరప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐ.పోలవరంలో సుదర్శనబాబు విగ్రహానికి సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, స్థానిక సొసైటీ అధ్యక్షుడు విత్తనాల శ్రీను, కొర్లపాటి ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా లక్ష తులసి పూజ



భూసమేత వేంకటేశ్వరస్వామివారికి లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు

తాళ్లరేవు: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష తులసి పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



ఉపాధి మేట్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మేట్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పెంచాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పెండ్యాల అన్నపూర్ణ, శిక్షణాధికారి సురేష్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం, నిందితుడితో తాళ్లరేవు ఎస్ఈబీ పోలీసులు

తాళ్లరేవు: తాళ్లరేవు సెబ్ స్టేషన్ అధికారులు బుధవారం నిర్వహించిన వేర్వేరు దాడుల్లో 72 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవానీ తెలిపిన వివరాల మేరకు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న అయినవిల్లిలంకకు చెందిన దాకారపు రవిరాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలించేందుకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెంకు చెందిన గూడే వెంకటేష్ అనే వ్యక్తిని సుంకరపాలెంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దాడిలో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం ప్రారంభం



గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటరావు తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని సవరప్పాలెంలో పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కె.వెంకటరావు, సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి బుధవారం ప్రారంభించినారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ సరైన సమయంలో పశువులు చూడి కట్టకపోతే రైతుకు ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. గర్భవాత పశువులకు సరైన సమయంలో వైద్యం చేయిస్తే మంచిదని సూచించారు. పశువైద్య శిబిరాలను పాడి రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో పశువులను పరిశీలించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి వెంకటేశ్వరరావు, పశు వైద్య సహాయకులు సాయినాథ్, వాణి, రమణ, అమీర్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెబుతున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడి గ్రామ పరిధి చప్పిడివారిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన దొండపాటి లోవరాజు, నాగాబత్తుల శేషమ్మ కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ కలిసి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తాను సమకూర్చిన నిత్యావసర సరకులను బాధితులకు శ్రీకాంత్ అందజేశారు. బాధితులను ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, ఉప సర్పంచ్ రంకిరెడ్డి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా చెముడులంక

- రూ.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- ఒకే రోజు 11 శిలాఫలకాలు ఆవిష్కరణ



చెముడులంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని చెముడులంక అభివృద్ధిలో జిల్లా స్థాయిలో అగ్రగామిగా కొనసాగుతుండడం అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సుమారు రూ.మూడు కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రికార్డు స్థాయిలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌తో పాటు ఎనిమిది సీసీ రోడ్లు, మూడు డ్రైనేజీలకు సంబంధించి బుధవారం ఒకేసారి 11 శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించి, పనులు ప్రారంభించారు. సర్పంచ్ తమ్మన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సుమారు రూ.పది కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు జరగాయన్నారు. గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మేజర్ డ్రైనేజీ సమస్య పరిష్కారమైందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు హిందూ దేవాలయాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. బడుగువానిలంకలో గ్రోయిన్ల నిర్మాణ పనులు చేసేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, అడబాల వీర్రాజు, బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు చేపట్టని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి

- అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్
- పారిశుధ్య విభాగం పనితీరుపై కౌన్సిలర్ల అసంతృప్తి



సమావేశంలో కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పలు పనులకు సంబంధించి ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులను సకాలంలో చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని పాలక పక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం జరిగిన సమావేశంలో పాలక పక్ష కౌన్సిలర్లు కొందరి కాంట్రాక్టర్ల తీరుపై ధ్వజమెత్తారు. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేసి వారిపై ఎందుకంత ప్రేమ చూపుతున్నారని పాలక పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర మండిపడ్డారు. వాటర్ వర్క్స్‌లో జనరేటర్ల ఏర్పాటుకు ఇచ్చిన కాంట్రాక్ట్‌లో ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. ఆ కాంట్రాక్టర్లు ఇంకా మున్సిపాలిటీకి జనరేటర్లు సమకూర్చాల్సి ఉండగా అతనికి రూ.2.50 లక్షలు బిల్లులు చెల్లించడమేంటని ప్రశ్నించారు. రూ.2.50 లక్షలను సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడును కోరారు. పారిశుధ్య విభాగం పనితీరు బాగోలేదని, ప్రతీ వార్డులో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పాలక పక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. దీనిపై స్పందించిన పారిశుధ్య పర్యవేక్షణాధికారి, ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ నా విధులు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఉంటాయని, పారిశుధ్య విభాగం అదనపు బాధ్యతలేనన్నారు. దీనిపై కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని జోక్యం చేసుకుని మీ మాట తీరు బాగోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ఇంజినీర్ వెంకటేష్ తన మాటలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పడంతో ఆ వివాదానికి అక్కడితో తెరపడింది. కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి మాట్లాడుతూ తన వార్డులో డ్రైనేజీని ఆక్రమించుకుని అక్రమ కట్టడం కడుతున్నారని తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా తదితరులు

అమలాపురం రూరల్: జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, వర్కింగ్ అధ్యక్షుడు బొక్కా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సరిదే సత్య పల్లంరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కడలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈదరపల్లిలో...

అమలాపురం రూరల్: కోనసీమ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఆర్కిటెక్చర్ సర్వేయర్ ఇంజినీర్ మెంబర్స్ వెల్ఫేర్(కలశం) క్యాలెండర్ ఆవిష్కరణ ఈదరపల్లి హోటల్ సత్కార్‌లో బుధవారం జరిగింది. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ జి.డేవిడ్ రాజు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఎస్.అమరయ్య, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.విజయ్‌కుమార్ కృష్ణ, ఎస్ఎస్‌వీఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్‌తో తాగునీటి సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- వాటర్ ట్యాంకు, పైపులైన్లకు శంకుస్థాపన



కేశనపల్లిలో తాగునీటి ట్యాంకు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జల జీవన్ పథకంతో గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు వేయడంతో తాగునీటి సమస్యల పరిష్కారమవుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం మండలం కేశనపల్లి, పడమటిపాలెం, తూర్పుపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన వాటర్ ట్యాంక్, పైపులైన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ జలజీవన్ పథకం రాజోలు నియోజకవర్గానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చుట్టూ సముద్రంతో పాటు ఉప్పునీటి సమస్యల తీవ్రంగా ఉన్న సముద్ర తీర గ్రామాలకు వరంగా ఈ పథకం నిలిచిందన్నారు. ప్రభుత్వం ద్వారా పూర్తి స్థాయిలో నిధులు తెచ్చి పనులు పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. అడిగిన వారందరికీ ఇంటింటికీ కుళాయి వేస్తున్నామని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బళ్ళ ప్రసన్న కుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, మలికిపురం మండల వైఎస్సార్‌సీపీ ప్రెసిడెంట్ అడబాల వీరబ్రాహ్మజీ, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్జింక సత్తిబాబు, ఆకుల మాధవీ నాగలక్ష్మి, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సుజాత, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, నల్లి సత్యం, సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యాత్ర



కేంద్ర పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్పలో బుధవారం వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలనే లక్ష్యంతో ఈ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఉచిత గ్యాస్ పంపిణీ, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలపై అందరికీ అవగాహన కల్పించేలా స్థానిక అధికారులు సైతం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అరుణ్‌ప్రకాష్, జీజీహెచ్ డీడీ రవిశంకర్, మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.13.67 లక్షలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను తెరిచి లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. గత 72 రోజులకు గాను హుండీల ఆదాయం రూ.13.67 లక్షలు వచ్చింది. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వినీతాదేవి, దేవాదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావుల పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ఇతర ఆలయాల ఈవోలు బి.వీర వెంకటేశ్వరరావు, సలాది మహేంద్ర, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, యెండూరి రాఘవ, దూనబోయిన బుజ్జి, సంసాని అబ్బు, ముంగర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి పాల్గొన్నారు.

ఉచిత బీమాకు నమోదు చేసుకోండి

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి ఉచిత బీమా పథకానికి అర్హులైనవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జీజీహెచ్ డీడీ రవిశంకర్ బుధవారం కోరారు. రూ.5 లక్షల ఉచిత బీమా పథకానికి సంబంధించి గ్రామాలు, పట్టణాల్లో ఉన్న పలువురు తమ పేర్లను నమోదుచేసుకోలేదన్నారు. జాబితాలో పేర్లు ఉన్నవారు తక్షణం యానాం జీజీహెచ్ 3వ అంతస్తులో ఉన్న ఎన్ఆర్‌హెచ్ఎం కార్యాలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ఉప్పలగుప్తం: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించి ప్రేమ కలిగి జీవించాలని సూచించారు.

'చెకుముకి'లో విద్యార్థుల ప్రతిభ



చెకుముకి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

రావులపాలెం: మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని స్థానిక సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు బుధవారం తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివిధ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించారు. పి.సూర్యనాగిరెడ్డి రెండో స్థానం, కె.రాగ సుస్మిత రెండో స్థానం, వై. సహస్ర రెండో స్థానం, బి.హారిక ఆదిలక్ష్మి మూడో స్థానం, పి.శంకర్ మూడో స్థానం, ఎం.లాస్యశ్రీ మూడోస్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ముల్లారావు, ఏఓ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం తదితరులు విద్యార్థులను అభినందించారు.